సంస్కృతి చరిత్రలో సురవరం ఓ అధ్యాయం

- ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- గ్రీన్‌బెల్ట్‌లోని సురవరం విగ్రహం వద్ద ఘననివాళి

ప్రతాప్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 28: తెలంగాణ సంస్కృతి చరిత్రలో సురవరం ప్రతాప్‌రెడ్డి ఓ అధ్యాయమని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీ గ్రీన్ బెల్ట్‌లో పాలమూర్ రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కవులేలేరన్న నినాదాన్ని సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన గోల్కొండ కవుల సంచిక గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానం ఇచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, పాలమూరు రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు ఇంద్ర సేనారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటాంరెడ్డి, కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

నారాయణ పేట టౌన్, మే 28 : నారాయణ పేటలో బుధవారం టీజేఎఫ్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను పాలమూరు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్టీవో జిల్లా మెంబర్ రాజేశ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పాటయి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్న జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేహెచ్ 143 జిల్లా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజ శేఖర్, సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, అంబదాస్, వెంకట్రాములు, రాము పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరులో చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, మే 28: నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలను గుర్తించి ప్రభుత్వం ఇండ్లు అందజేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన శివ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు అందించే చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను, ఇల్లు లేని నిరుపేదలకు మాత్రమే అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కృష్ణ, మే 28: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథులుగా హాజరై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు స్థానిక తాసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జానయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాగనూరులో..

మాగనూరు, మే 28: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దాదాపు 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రహమ తఫ్సీన్, నాయకులు అనంద్ గౌడ్, శివరాం రెడ్డి, దండు ఆనంద్, రాజు పాల్గొన్నారు.

పెండింగ్ కాల్వ పనులను పూర్తి చేయాలి

- మహబూబ్‌నగర్ ఆర్డీవో అనిల్‌కుమార్

తాసీల్దార్‌లతో మాట్లాడుతున్న ఆర్డీవో అనిల్ కుమార్

దేవరకద్ర, మే 28: మండలంలోని వివిధ గ్రామాల్లో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని మహబుబ్‌నగర్ ఆర్డీవో అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం ఆర్డీవో దేవరకద్ర తాసీల్దార్ కార్యాలయంలో దేవరకద్ర, కౌకుంట్ల, చిన్నచింతకుంట మండలాలకు చెందిన తాసీల్దార్లతోపాటు ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మండలంలోని దేవరకద్ర, డోకూర్, గోపన్‌పల్లి, పుట్టపల్లి, కౌకుంట్ల వరకు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఎడమ కాల్వ నుంచి ఆయా గ్రామాల రైతులకు సాగు నీరు అందించేందుకు కాల్వలు ఏర్పాటు చేయడం జరిగిందని, దీంతో కాల్వలు కొంత పూడుకు పోవడం తోపాటు, కాల్వలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని వాటిని తొలగించి చివరి ఆయకట్టు రైతుల భూములకు సాగు నీరు అందించేలా చూడాలన్నారు. ఇరిగేషన్ డీఈ చందు, ఆయా మండలాలకు చెందిన తాసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Raju S/o Balappa, age 35 years, Occ: Business, R/o H.No.7-139, Reddy Nagar, Makthal town & Mandal, Narayanpet Dist., **Applicant / Borrower,** Smt. Vadde Santhoshi W/o Vadde Raju, age 32 years, Occ: Business, R/o H.No. 7-139, Reddy Nagar, Makthal town & Mandal, Narayanpet Dist., **Co-Borrowers / Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఇల్లును తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్నయెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

The Residential Open Plot No.6/A/1 admeasuring 150.58 Sq.Yrds in Sy.NO.90, situated in Block No.7, Kammathnarva shivara, Makthal Mandal, Narayanpet Dist., which is bounded as under: **East:** Open plot of Gopal Reddy & Brothers, **West:** Plot of V. Raju, **North:** Plot No.6/A, **South:** 15Ft. Road.

MALLIKARJUN B.A, LL.B.,
Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- పాలమూరు ఎంపీ డీకే అరుణ
- ఎంపీ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం

నారాయణ పేట టౌన్, మే 28: కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని దిశ కమిటీ చైర్‌పర్సన్ డీకే అరుణ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) రెండో సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి సమావేశంలో సమీక్షించారు. మొత్తం 46ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర, రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆమె ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజ కీయాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్ర మోహన్ వైద్యశాఖ నివేదికలో భాగంగా జిల్లాకు విధించిన ఏఎన్‌సీ, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్ స్టేరిలైజేషన్, ప్రసవాల టార్గెట్లు, అచీవ్‌మెంట్ల గురించి తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ జిల్లాలో పీఎం కిసాన్ యోజన పథకం కింద అర్హత కల్గిన 74,495 మంది రైతు కుటుంబాలకు 324.6074 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇక డీఆర్‌డీఏ మొగులప్ప ఉపాధి హామీ గురించి వివరిస్తూ జిల్లాలో మొత్తం 1.10 లక్షల జాబ్ కార్డులు జారీ చేయడం జరిగిందని, అందుకు గాను 2.01లక్షల మంది కూలీల సంఖ్య ఉందని, 2025- 26 లేబర్ బడ్జెట్ 12.24 లక్షల పనిదినాలు ఉండగా, ఈ నెల 22 వరకు 5.15 లక్షల పనిదినాలు కల్పించినట్లు వివరించారు.

మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ, చిత్రంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్

జిల్లాలో మొత్తం 500 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా 52,667 మంది విద్యార్థులకు గాను మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని డీఈవో గోవింద రాజులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీఎఫ్‌వో అరవింద్, ఆర్డీవో రాంచంద్రనాయక్, జెడ్పీసీఈవో శైలేశ్‌కుమార్, దిశ కమిటీ సభ్యులు లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్, పాండు నాయక్, కిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

- వార్డు అధికారులను స్థానికులు గుర్తించేలా పనిచేయాలి
- కలెక్టర్ విజయేందిరబోయి
- నగరపాలక, మున్సిపల్ వార్డు అధికారులకు దిశానిర్దేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 28: వర్షాకాలంలో మహబూబ్‌నగర్ పరిశుభ్రంగా ఉండేలా వార్డు అధికారులు పారిశుధ్య నిర్వహణ సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నగరపాలక, మున్సిపల్ వార్డు అధికారులకు ఏర్పాటు చేసిన దిశానిర్దేశం కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలులో వార్డు అధికారులదే కీలకపాత్ర అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, రేషన్‌కార్డులు వంటి వాటన్నింటినీ వార్డు అధికారులే పరిశీలించాలన్నారు. ప్రతిరోజూ కేటాయించిన వార్డులో చెత్త సేకరణ సిబ్బంది వస్తున్నారా.? లేదా.? తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా.? చెత్తను ప్రజలు వేరు చేసి ఇస్తున్నారా.? లేదా అనే విషయాలు పరిశీలించాలన్నారు. నిత్యం కనీసం పది ఇళ్లల్లో నివాసం ఉండే వారితో వివరాలు సేకరించాలన్నారు. చెత్త సేకరించే వారు రానట్లయితే పై అధికారులకు తెలియజేయాలన్నారు. ఖాళీ స్థలంలో చెత్త ఉంటే ఆ స్థలం వారి వివరాలు పక్క ఇంటి వారి ద్వారా తెలుసుకొని ఆ స్థలాన్ని శుభ్రం చేసుకుని బౌండరీలు నిర్మించుకోవాలని సూచించాలన్నారు. లేదంటే పెనాల్టీ కట్టాల్సి వస్తుందని వారికి తెలియజేయాలన్నారు. కాల్వల పరిశుభ్రత, వ్యాధుల నియంత్రణ, తాగునీటి, విద్యుత్ నిర్వహణ, నల్లా కనెక్షన్లు, మున్సిపల్ పన్నులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ శాఖ ద్వారా వచ్చిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను అధికారులు వందశాతం అమలు చేయాలని సూచించారు. డ్రైడే వంటి కార్యాక్రమాలు కచ్చితంగా నిర్వహించాలన్నారు. వార్డు అధికారి వారి వార్డుకు వెళ్తే స్థానికులు వార్డు అధికారి అని గుర్తుపట్టాలని ఆ విధంగా ప్రతిరోజూ పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట టౌన్, మే 28: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బస్ డిపోలో నూతన బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ లావణ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

మహ్మదాబాద్ తాసీల్దార్‌గా విద్యాసాగర్‌రెడ్డి

బాధ్యతలు స్వీకరించిన విద్యాసాగర్‌రెడ్డి

మహ్మదాబాద్, మే 28: మహ్మదా బాద్‌తాహసీల్దార్‌గా విద్యాసాగర్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తాసీలార్ తిరుపతయ్య నారాయణ పేట జిల్లాకు బదిలీకావడంతో రాజా పుల్ మండలం నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. మండలంలో పలువురు నాయకులు తాసీల్దార్‌ను మర్యాద పుర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యాలయ సిబ్బందిని పరిచయం చేసుకుని మండల స్థితిగతులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కేఎం నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, రాధారెడ్డి, అనంతయ్యగుప్తా, సాయితేజ రెడ్డి, శ్రీనునాయక్, నిరంజన్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

కౌకుంట్ల తాసీల్దార్‌గా సుందర్‌రాజ్

బాధ్యతలు స్వీకరించిన సుందర్‌రాజు

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మే 28: కౌకుంట్ల మండల తాసీల్దార్‌గా సుందర్‌రాజ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన మహబూబ్‌నగర్ రూరల్ తాసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై కౌకుంట్లకు వచ్చారు. అలాగే డిప్యూటీ తాసీల్దార్‌గా ఆంజనేయులు కూడా బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వహించిన తాసీల్దార్ అబ్దుల్ రహమాన్ కలెక్టరేట్‌కు, డీటీగా విధులు నిర్వహించిన సుజాత ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కౌకుంట్ల ఆర్ఐ ఖదీర్ పాషా, కార్యాలయ సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

బాలానగర్/రాజాపూల్, మే 28: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈవో శంకర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలు, కస్తూర్బా పాఠశాలకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. రాజాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈవో సుధాకర్ తెలిపారు.

ఆర్‌వో ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

మిడ్జిల్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు

జడ్చర్ల(మిడ్జిల్), మే 28: మిడ్జిల్ మండలం కేంద్రంలో మహబూబ్‌నగర్ ఎంపీ నిధులతో ఆర్‌వో వాటర్ ప్లాంట్ నిర్మించనున్నారు. అందుకు సంబంధించి బుధవారం మండల కేంద్రంలో ఆర్‌వో ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎంపీ డీకే అరుణ సహకారంతో ఈ ప్లాంట్‌ను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్థలదాత భీమ్‌రెడ్డి, పీఏసీసీఎస్ వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి, మేడిపల్లి బాల్‌రెడ్డి, గౌస్, మాజీ సర్పంచ్ రాధిక, శారద తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభం

నవాబ్‌పేట, మే 28: మండలంలోని పోమాల, గురుకుంటలో బుధవారం మార్కెట్ చైర్మన్ హరలింగం ఇందిరమ్మ ఇండ్ల పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇండ్ల నిర్మాణానికి మార్క్ అవుట్ వేశారు. అనంతరం ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. త్వరగా చేపట్టిన వారికి వెంటనే బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. హౌజింగ్ ఏఈ శ్రావణి, నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుడి ఫిర్యాదుతో కదిలిన కన్జ్యూమర్ ఫోరం అధికారులు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 28: జిల్లా కేంద్రంలోని మటన్ దుకాణంలో తూకంలో తేడా వస్తుందని ఇటీవల ఓ వినియోగదారుడు వరల్డ్ కన్జ్యూమర్ రైట్స్, ద నేషనల్ కన్జ్యూమర్ రైట్స్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో సంబంధిత అధికారులు బుధవారం జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రవీందర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన మటన్ షాపుపై రైడ్ చేసి తూకం బాట్లు, ఎలక్ట్రిక్ కాంటాలను పరిశీలించి తూకంలో తేడా ఉన్న కాంటాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. ఎన్‌జీవో సంస్థ అధికారులు మాట్లాడుతూ.. వినియోగదారులు ధైర్యంగా ముందు కొచ్చి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తే అక్రమదారులను అడ్డుకోవచ్చని తెలిపారు.

నేడు గ్రామసభలు

మక్తల్, మే 28: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ చంద్రశేఖర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కాట్రేవుపల్లి, ఎర్నాగన్‌పల్లి, టేకులపల్లి, మంతన్‌గౌడ్, కాచ్‌వార్ గ్రామాల్లో గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు గ్రామసభలు నిర్వహిచి రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరై రైతులతో అభిప్రాయ సేకరణ సేకరిస్తారని సూచించారు. ఐదు గ్రామాలకు చెందిన రైతులు గ్రామసభకు హాజరై తమ డిమాండ్లను గ్రామసభలో బహిర్గతం చేయాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

బాలానగర్, మే 28: మద్యం తాగి వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై లెనిన్ వాహనదారులను హెచ్చరించారు. బుధవారం జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. ఇటీవల తరచూ జరుగుతున్న వాహనాల ప్రమాదాలు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడిపించడమే కారణమన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపించడంతో తాము ప్రమాదంలో చిక్కుకోవడం తోపాటు ఇతరులను ప్రమాదాలకు గురి చేయడమేనని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, మే 28: 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైల బుల్ స్కూల్ స్కీం కోసం నూతన, రెన్యువల్‌కు పాఠశాల యాజమాన్యాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి బుధవారం ప్రకటనలో తెలిపారు. స్కూల్ యాజమాన్యం తమ దరఖాస్తులను ఈనెల 31లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహమ్మదాబాద్, మే 28: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏవో మద్దిలేటి తెలిపారు. పుట్టపాడ్ నుంచి నంచర్ల, మహమ్మదాబాద్ సబ్‌స్టేషన్లకు కొత్త లైన్లు చేయడంతో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అందుకు ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ధాన్యం తూకంలో తరుగు తీయొద్దు

- కాంటా చేసిన ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేయాలి
- కలెక్టర్ విజయేందిర బోయి

నవాబ్‌పేట, మే 28: రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యం తూకంలో తరుగు తీయొద్దని కలెక్టర్ విజయేందిర బోయి కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని గురుకుంట, కొల్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట గురుకుంట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి.. అక్కడి మహిళా సంఘం సభ్యులతో మాట్లాడారు. కాంటా చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లిఫ్ట్ చేసి రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పాలని పేర్కొన్నారు. లారీల కొరత ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం కొల్లూరులోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొల్లూరులో ధాన్యం తూకంలో తరుగు తీస్తున్నట్లు కొంతమంది రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తరుగు తీయొద్దని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రెండు కిలోలు, రైస్ మిల్లులో రెండు కిలోలు తరుగు తీస్తే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కాంటా చేసిన వెంటనే వారి ధాన్యానికి సంబంధించిన రశీదు బిల్లు అందజేయాలని సూచించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొంత అనుమానం ఉన్న కేంద్రాలపై నిఘా పెట్టాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం జీవరత్నం తదితరులు ఉన్నారు.

కొల్లూరు కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

బీఫార్మా, బీఎడ్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 28: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో మార్చిలో నిర్వహించిన బీఫార్మా మొదటి సంవత్సరం, బీఎడ్ సెమిస్టర్-3 సంవత్సరం పరీక్ష ఫలితాలను బుధవారం పీయూ పరిపాలన భవనంలో వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస్ చేతుల మీదుగా విడుదల చేశారు. బీఫార్మా మొదటి సెమిస్టర్‌లో 51.52శాతం, బీఎడ్ సెమిస్టర్-3లో 80.83శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వైస్‌చాన్స్‌లర్ తెలిపారు. ఈ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారిణి ప్రవీణ, అడిషనల్ సీవోఈ శాంతిప్రియ, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, సీవోఈ

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

నారాయణపేట, మే 28: పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల వద్ద ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద పోలీసు, పశుసంవర్ధకశాఖ అధికారులు సమన్వయంతో షిఫ్టుల వారిగా విధులు నిర్వర్తిస్తూ పశువులను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తారని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవా